# జలవనరుల్లో మత్స్యసిరులు



వెన్నంపల్లి చెరువులో చేపపిల్లలను విడుదల చేస్తున్న మత్స్య కారులు (ఫైల్)

ఒకప్పుడు నీటి వసతి లేక కరువు చాయలు అలుముకొన్న మెట్ట ప్రాంతం సైదాపూర్ మండలం.. నేడు నిండుకుండను తలపించే జల వనరులతో కళకళలాడుతున్నది. దీనికితోడు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై చేపలను అందిస్తుండ డంతో మండల వ్యాప్తంగా మత్స్యసంపద గణనీయంగా పెరి గింది. వాటి అమ్మకాలతో ఉపాధి మెరుగుపడడంతో మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

*- సైదాపూర్, అక్టోబర్ 12*

- **సైదాపూర్ మండల వ్యాప్తంగా గణనీయంగా పెరిగిన చేపలు**
- **100శాతం సబ్సిడీపై అందించిన సర్కారు**
- **ఉపాధి మెరుగుపడడంతో ఆనందంలో మత్స్యకారులు**

సైదాపూర్ మండలంలో మొత్తం 26 గ్రామాలు ఉండగా, 68 చెరువులు, కుంటల్లో చేప పిల్లలను పెంచుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం 2017 నుంచి వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలను అందిస్తుండగా, మత్స్యకారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 64 చెరువులు, కుంటల్లో 19.20 లక్షల చేపపిల్లలు (35–40 ఎంఎం), నాలుగు చెరువుల్లో 2.75 లక్షల (80–100 ఎంఎం) చేపపిల్లలను ప్రభుత్వం విడుదల చేయగా, మత్స్యకారులు వాటి పెంపకంతో ఉపాధి పొందుతున్నారు. గ్రామాల్లో విక్రయాలు చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు.

### ప్రభుత్వానికి రుణపడి ఉంటం



ప్రభుత్వం మత్స్యపారిశ్రామిక సంఘాలకు ఉచితంగా చేపపిల్లలను అందిస్తుండడం గొప్ప విషయం. దీంతో గ్రామాలోలని మత్స్యకారులకు ఉపాధి మెరుగుపడింది. చేపల విక్రయాలతో ఆర్థికంగా ఎదిగే అవకాశం లభించింది. ఇలాంటి గొప్ప ప్రభుత్వానికి రుణపడి ఉంటం.

*- పెసరు కుమారస్వామి, ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు*

### గతంలో ఎవరూ ఇవ్వలేదు



ఇదివరకు ఏ ప్రభుత్వం కూడా ఉచితంగా చేపపిల్లలను అందించలేదు. తెలంగాణ వచ్చాక మత్స్యకారులకు ఎంతో మేలు జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందించడంతో చెరువుల్లో మత్స్య సంపద పెరుగుతున్నది. మత్స్యకారుల ఉపాధికి భరోసా దొరుకుతున్నది.

*- పోలు ప్రవీణ్‌కుమార్, ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి*

## 128 మంది బైండోవర్

ఇల్లందకుంట/ వీణవంక, అక్టోబర్ 12: మండలానికి చెందిన పాతనేరస్తులు 20 మంది, బెల్ట్ షాపుల నిర్వాహకులు 50 మంది, రౌడీషీటర్లు 11 మందిని తహసీల్దార్ రాణి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని చెప్పారు. అలాగే వీణవంక మండలానికి చెందిన 48 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ ఆసిఫ్ తెలిపారు.



సైదాపూర్: వెన్నంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సంబురాల్లో విద్యార్థులు



వీణవంక: మామిడాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

# విద్యాలయాల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలు

జమ్మికుంట, అక్టోబర్ 12: పట్టణంలోని న్యామిలీనియం పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా వీణవంక ఎంపీపీ ముసిపట్ల రేణుక–తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. పాఠశాల ఆవరణలో ఆడారు. తర్వాత బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అంతకుముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తిరుపతిరెడ్డి, వీణవంక ఎంపీపీ రేణుక మాట్లాడుతూ, పండుగల విశిష్టతను నేటి విద్యార్థులకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇక్కడ ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ వరుణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు లావణ్య, శారద, పావని, రేణుక, పార్వతి, మినహాజ్, మమత, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

సైదాపూర్, అక్టోబర్ 12: మండలంలోని వెన్నంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నల్లానితండా పీఎస్‌తో పాటు పలు విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జమ్మికుంట: న్యామిలీనియం పాఠశాలలో బతుకమ్మ పేర్చుతున్న వీణవంక ఎంపీపీ ముసిపట్ల రేణుక, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు

వీణవంక, అక్టోబర్ 12: మండలంలోని మామిడాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మలను పేర్చి ఆడిపాడి, సందడి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినులు సుద్దాల శోభారాణి, శ్యామల, ఉపాధ్యాయులు సరితారాణి, రాజేశ్వరరావు, సురేందర్, సరోజన, సంగీత, తిరుపతిరెడ్డి, రాము, విద్యార్థినులు పాల్గొన్నారు.



శివాలయ ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్

# ‘కవిత’కు ఘన స్వాగతం పలుకుదాం

- **‘బతుకమ్మ’ను గొప్పగా నిర్వహించుకుందాం**
- **మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు.. జమ్మికుంటలో ఏర్పాట్ల పరిశీలన**

జమ్మికుంట, అక్టోబర్ 12: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం జమ్మికుంటలో జరిగే బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటున్నారని, పట్టణానికి రాబోయే ‘కవిత’కు ఘన స్వాగతం పలుకుదామని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. మన సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మను గొప్పగా నిర్వహించుకుందామని, ‘కవిత’తో వేడుకల్లో పాలుపంచుకుందామని పేర్కొన్నారు. భారీ సంఖ్యలో మండలం, పట్టణంలోని మహిళలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. జమ్మికుంట పట్టణంలోని శివాలయం ఆవరణలో బతుకమ్మ వేడుకలకు మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా, ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కవిత పాల్గొనే వేదిక, బతుకమ్మ ఆటపాటలకు సరిపడా స్థలాన్ని ప్రత్యేకంగా కేటాయించారు. అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. తర్వాత చైర్మన్ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ కవిత తొలిసారి జమ్మికుంటలో బతుకమ్మ వేడుకలకు హాజరవుతున్నారని, ఆమెతో పాల్గొనే ప్రతి మహిళా గ్రూపును నేరుగా కలువనున్నదని తెలిపారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిన జాగృతి అధ్యక్షురాలిని గొప్పగా గౌరవించుకుందామని కోరారు. ఇక్కడ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న, కమిషనర్ శ్రీనివాస్, అధికారులు, పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

# పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలి

- **బీఆర్ఎస్ శ్రేణులకు జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పిలుపు**



శంకరపట్నం: కొత్తగట్టు బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

శంకరపట్నం, అక్టోబర్ 12: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ తిరిగి ఓటర్లకు వివరించాలని జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లింగాపూర్, కొత్తగట్టు, మెట్‌పల్లి, మొలంగూర్, చింతలపల్లి, రాజాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా హాజరైన జడ్పీటీసీ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి కుటుంబం బీఆర్ఎస్‌కే ఓటు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులికోట రమేశ్, సర్పంచుల ఫోరం చైర్మన్ పల్లె సంజీవరెడ్డి, సర్పంచ్ కిషన్‌రావు, ఆర్‌బీఎస్ జిల్లా సభ్యుడు అంతం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, భూమ సంపత్, మేడుదుల ఐలయ్య, శ్యాంరావు, వంగల కిషన్‌రెడ్డి, కుమార్ యాదవ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి చేయూత

చిగురుమామిడి, అక్టోబర్ 12: మండలంలోని ఇందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కూన శివానికి బొట్ల పురుషోత్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బొట్ల సతీశ్, ప్రధాన కార్యదర్శి బొట్ల లక్ష్మణమూర్తి చేయూతనందించారు. గాగిరెడ్డిపల్లి నుంచి ఇందుర్తి పాఠశాలకు రోజు మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్తూ చదువుకుంటున్న ఆమెకు గురువారం సైకిల్ వితరణ చేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు